సాక్షి
పెద్దపల్లి

శనివారం, 10 ఆగస్టు 2024





పెద్దపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న లహరి

పాలుపోసి.. మొక్కులు చెల్లించి

శ్రవణంలో తొలిశుక్రవారం, నాగుల పంచమి సందర్భంగా మహిళలు నాగదేవత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని, సుల్తానాబాద్, మంథని తదితర ప్రాంతాల్లో పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. తమ కుటుంబాలను సల్లంగా చూడాలని దేవతలను వేడుకున్నారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చుకున్నారు. కొందరు పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన లహరి బొటిక్ నిర్వాహకురాలు లహరి యాచకులకు బొట్టు పెట్టి చీర, పసుపు, కుంకుమను వాయినంగా ఇచ్చారు. యాచకుల్లో ఆనందం నింపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



వాయినాలు ఇచ్చుకుంటున్న భక్తులు



గోదావరిఖనిలోని నాగదేవత ఆలయం వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



రామగుండంలో పుట్టలో పాలు పోస్తూ..



షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సూర్యనారాయణరెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు తదితరులు

కరీంనగర్ సిటీలో సినీతారలు సందడి చేశారు. ప్రముఖ టాలీవుడ్ హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్ నగరంలో నూతనంగా ఏర్పాటుచేసిన సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. అంతకు ముందు చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, ప్రముఖ వైద్యుడు సూర్యనారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మాల్ 32వదని, త్వరలోనే నిజామాబాద్, మేడ్చల్‌లోనూ మాల్స్ ప్రారంభిస్తామని సీఎంఆర్ ఎండీ మావూరి వెంకటరమణ తెలిపారు. సినీతారలను చూసేందుకు పెద్దఎత్తున అభిమానులు తరలివచ్చారు. వారితో హీరోయిన్లు సెల్ఫీలు దిగారు. అనంతరం మాల్‌లో పలు వస్త్రాలను పరిశీలించి, సంతోషం వ్యక్తం చేశారు. – కరీంనగర్‌కల్చరల్



షాపింగ్‌మాల్‌లో చీరలు చూపుతూ సందడి చేస్తున్న పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్

పాయల్ జోష్.. సంయుక్త సందడి





సినీతారలను చూసేందుకు షాపింగ్‌మాల్ వద్దకు తరలివచ్చిన అభిమానులు, ప్రజలు

న్యూస్‌రీల్

హైకోర్టు ఏజీపీగా 'ఖని'వాసి




సాయి ఆకర్ష్

గోదావరిఖనిటౌన్: హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాది(ఏజీపీ)గా గోదావరిఖని సీతానగర్‌కు చెందిన కొమిరె సాయి ఆకర్ష్‌ను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సాయిఆకర్ష్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. హైకోర్టులో ఎనిమిదేళ్లుగా న్యాయవాదిగా పనిచేస్తున్నారు. వృత్తిలో అంకితభావం ప్రదర్శించిన ఆయనకు అనతి కాలంలోనే ఏజీపీగా అవకాశం లభించింది. గోదావరిఖని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను అభినందించారు.

హక్కులపై అవగాహన

పాలకుర్తి(రామగుండం): బామ్లానాయక్ తండాలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గిరిజన హక్కులు, చట్టాలు, వాటి అమలు తీరుపై అవగాహన కల్పించారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సివిల్ జడ్జి స్వప్నరాణి అధ్యక్షతన ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాల్య వివాహాల నిర్మూలన, చిన్నారులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నతంగా చదివి గొప్పస్థాయికి చేరేలా ప్రోత్సాహం అందించాలని జడ్జి సూచించారు. వృద్ధులతో సహనంతో వ్యవహరించాలని కోరారు. లాయర్లు నరేశ్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అనిల్, మాజీ సర్పంచ్ రాజునాయక్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం స్వతంత్య్ర వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. సభావేదిక, సీటింగ్ తదితర ఏర్పాట్లు ప్రొటోకాల్ ప్రకారం ఉండాలన్నారు. స్వశక్తి, మెప్మా సంఘాలు హాజరయ్యేలా చూడాలని అన్నారు. ముఖ్యఅతిథి ఇచ్చే సందేశం కోసం ప్రభుత్వ శాఖల ద్వారా అందించిన సంక్షేమపథకాల వివరాలు ఈనెల 12 వరకు క్లుప్తంగా అందించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆయన కోరారు. సమావేశంలో ఆర్డీవో గంగయ్య, ఏసీపీ గజ్జి కృష్ణ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణ పొందేందుకు దఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ రవి తెలిపారు. హైదరాబాద్‌లో 90రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిన శిక్షణ ఉంటుందని, ఈసమయంలో నెలకు రూ.4వేలు ఉపకారవేతనం అందిస్తారన్నారు. టెన్త్, ఇంటర్ పాసై 18 నుంచిన వారు అర్హులన్నారు. వివరాలకు 0878–2268686 నంబరులో సంప్రదించండి.

దోమల దండుయాత్ర



- నిర్లక్ష్యంగా మూలనపడేసిన ధర్మాఫాగర్స్ యంత్రం ఇది. రామగుండం నగర పాలక సంస్థలోనిది. సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఇలాంటి ఏడు ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. వీటితోపాటు అప్పటికే వాహనాల్లో అమర్చే ఫాగింగ్ మిషన్లు కూడా ఉన్నాయి. వీటిని బల్దియా ఆవరణలోని సీఆర్సీ భవనంలో మూలనపడేసి తాళం వేశారు. మరమ్మతుల కోసం యత్నించగా మూడే పని చేస్తున్నాయని తేలింది. కొన్నింటి విడిభాగాలు మాయమయ్యాయి. నగరవాసులు దోమలతో సతమతమవుతున్నారు.

- ఊసేలేని ఫాగింగ్
- కానరాని ఆయిల్ స్ప్రే
- ఇంటింటా జ్వర బాధితులు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో దోమలు విజృంభిస్తున్నాయి. వైరల్, విషజ్వరాలు విస్తరిస్తున్నాయి. ఇంటికొకరు జ్వరంతో బాధపడతున్నారు. దోమకాటుతో ప్రబలుతున్న ఈ జ్వరాలు 15రోజులపాటు ప్రజల్ని పట్టి పీడిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. బల్దియాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడి మురుగు అక్కడే నిలుస్తోంది. దోమలకు ఆవాసాలుగా మారాయి. జనాలపై దండయాత్ర చేస్తున్నాయి. విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఫాగింగ్, ఆయిల్ స్ప్రే, బ్లీచింగ్ చల్లడం విస్మరించారు. తద్వారా డెంగీ, మలేరియా సోకుతూ ప్రజలు వణుకుతున్నారు.

కదలని మురుగు

- ఖాళీస్థలాల్లో నీరు నిలుస్తోంది. కాలువల్లో మురుగు కదలడం లేదు.
- పారిశుధ్యం లోపించింది. అయినా అధికార యంత్రాంగానికి దోమ కుట్టినట్లు కూడా లేదని జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- దీనికితోడు చాలామంది ప్రజలు డ్రమ్ములు, పాతటైర్లు, తుక్కు సామగ్రి, ఇతర పాత్రల్లో నీరు నిల్వ చేస్తుంటారు.
- మిద్దెలు, ఇంటి ఆవరణల్లో కుండీలు, సీసాలు, వృథా సామగ్రి పడేస్తుంటారు. వీటిలో కొద్దిగా నీరు చేరినా డెంగీ దోమ పుడుతుంది.
- బూడిదరంగులో ఉంటూ తక్కువ ఎత్తులో ఎగిరే ఈ దోమలు కుట్టి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని పలువురు వైద్యులు వివరిస్తున్నారు.



- ఇది జిల్లాకేంద్రంలోని మైత్రికాలనీ ఎక్సైజ్ కార్యాలయం సమీపంలోని ఖాళీప్లాట్. ఏకధాటి వర్షాలతో వచ్చిన వరద ఇందులో చేరింది. నివాసాల మధ్య రోజుల తరబడి నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెంది దాడులు చేయడంతో స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. బల్దియాలో 36 వార్డులు ఉండగా, రెండు యంత్రాలతో ఫాగింగ్ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో కానరావడంలేదు. సుల్తానాబాద్, మంథని బల్దియాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



- దోమల నిర్మూలన, పారిశుధ్య పనులకు ఏటా రూ.50లక్షలు వెచ్చిస్తున్నామని రామగుండం బల్దియా అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రెండు వాహనాల్లో యంత్రాలు బిగించి రోజూ రెండు డివిజన్లలో ఫాగింగ్ చేస్తున్నామని అంటున్నా.. క్రమం తప్పకుండా తిప్పడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య అధికారుల పర్యవేక్షణలేక, సిబ్బంది కొందరు ఫొటోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసేవరకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

జాడలేని ఫాగింగ్

మున్సిపాలిటీల్లో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నా వినియోగించడం లేదనే విమర్శలు ఉన్నాయి. తరచూ దోమల నివారణ చర్యలు చేపడుతున్నామని రికార్డుల్లో నమోదు చేయడం, నిధులు ఖర్చుచేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఫలితాలు ఏమీ ఉండడంలేదు. దోమల నివారణకు ఏటా రూ.2లక్షల – రూ.6లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెప్పుతున్నారు. మరోవైపు.. ప్రతీనెల నిత్యావసరాలతోపాటు దోమల నివారణకు లిక్విడ్, మస్కిటో కాయిల్స్ వంటివాటి కొనుగోలుకు ఒక్కో కుటుంబం రూ.100 – రూ.500 వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇవి కాకుండా దోమల బ్యాట్లు, దోమతెరల ఖర్చు అదనంగా ఉంటోంది.

ఫాగింగ్ చేస్తాం..

రామగుండం కమిషనర్ శ్రీకాంత్‌ను సంప్రదించగా, ప్రతీవార్డులోనూ ఫాగింగ్ చేస్తామన్నారు. మూలనపడిన ఫాగింగ్ యంత్రాలను మరమ్మతు చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.

దోమలు.. వ్యాధులు..

- అనాఫిలిస్ : మలేరియా
- క్యూలెక్స్ : బోదకాలు, మెదడువాపు
- ఏడీస్ : డెంగీ, చికున్‌గున్యా
- మాక్సోనియా : బోదకాలు

అధికారులు ఏం చేయాలంటే..

- ఖాళీస్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయాలి. స్పందించకుంటే జరిమానా విధించాలి
- జరిమానా చెల్లించకుంటే శుభ్రం చేయించి ఆ ఖర్చు యజమానుల నుంచి వసూలు చేయాలి
- మురుగునీటిలో ఎంఎల్వో ఆయిల్ బాల్స్ విసరాలి. కిరోసిన్, ఇతర రసాయనాలు చల్లాలి. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి.

ఆదివాసీలకు ప్రత్యేక పథకాలు

జ్యోతినగర్(రామగుండం): ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సోయం జనార్దన్, ఆదివాసీ సంఘం గ్రామ పటేల్ ఆత్రం చంద్రయ్య, గౌరవ అధ్యక్షుడు ఆత్రం భూమయ్య డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లి గ్రామంలో శుక్రవారం జెండా పండుగ నిర్వహించారు. గిరిజన యోధుడు కొమురంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారుతున్నా తమ గ్రామాలు ఊరు చివరగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యపరంగా ఇంకా తాము వెనుకబడి ఉన్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ జోక్యం చేసుకుని తమను ఆదుకోవాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం రమేశ్, గుర్రాల సమ్మయ్య, ఆత్రం శంకర్, కుర్సే నందస్వామి, ఆత్రం లక్ష్మీనరసింహ, కురిసెంగ నారాయణ, ఆత్రం సాయి కేదాస్, సోయం శ్రీనివాస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న జనార్దన్

సస్యరక్షణ పాటించాలి



మాట్లాడుతున్న ఆదిరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో సన్నరకం వరి సాగు విస్తీర్ణం ఈసారి గణనీయంగా పెరిగింది. అయితే, మొగిపురుగు, గొట్టంపురుగు, ఉల్లికోడు సోకి వరిపైరు ఎర్రబడుతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లారు. అన్నదాతలు వెలిబుచ్చిన సందేహాలను డీఏవో నివృత్తి చేశారు. పంటను కాపాడుకునేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. – పెద్దపల్లిరూరల్

- సన్నరకాన్ని ఆశించిన మొగిపురుగు
- గొట్టం పురుగు, ఉల్లికోడుతోనూ ముప్పు
- సందేహాలు నివృత్తి చేసిన డీఏవో ఆదిరెడ్డి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

సాక్షి ఫోన్ ఇన్

- దాదాపు నెల క్రితం బీపీటీ – 5204 రకం వరిని ఏసిన. మొగిపురుగు సోకింది. ఏం చేయాలి?
  – పత్తి లక్ష్మారెడ్డి, పెగడపల్లి

డీఏవో : పైరుకు కార్బొకొరడాన్ –3జి గులికలు వేయించి, ఏఈవో సూచన మేరకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

- బీపీటీ రకం సాగు చేశా. కాండం తొలిచే పురుగు సోకింది ఏం చేయాలి?
  – ఎర్రం మల్లారెడ్డి, కాసులపల్లి

డీఏవో : వాతావరణ పరిస్థితులతో సన్నరకం వరిపైరుకు తెగులు సోకుతోంది. కార్బొఫరాన్ గుళికలు వేయించాలి.

- వరిపైరు పిలకలు రావడం లేదు?
  – బండారి ఐలయ్యయాదవ్, కొలనూర్

డీఏవో : నాటు వేసే ముందు మడిలో కొయ్యలు కాల్చడంతో ఈ సమస్య వచ్చింది. కలుపు తీసి పొలాన్ని ఆరబెట్టాలి. ఆ తర్వాత యూరియా చల్లాలి.

- కలుపు నివారణకు గడ్డిమందుతో కలిపి పురుగు మందు చల్లవచ్చా?
  – గిర్నేని సంపత్‌రావు, నిట్టూరు, పెద్దపల్లి

డీఏవో : కూలి డబ్బులు మిగులుతుందని అలా చేయొద్దు. కలుపు మందు చల్లిన 10రోజుల తర్వాత పురుగుమందు చల్లాలి. లేదంటే పైరు ఎర్రబడి దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

- రుణమాఫీ, ఇతర పనులకే ఏవో, ఏఈవోలు పరిమితమయ్యారు. సలహాలు ఇవ్వడం లేదు?
  – గాదె ఓదెలు, కమాన్‌పూర్

డీఏవో : వారు రైతువేదికల్లో రైతుల కోసమే అందుబాటులో ఉంటున్నారు. రుణమాఫీ, రైతుబీమా సందేహాలు నివృత్తి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూస్తాం.

- రాయితీపై రైతులకు జింక్‌సల్ఫేట్ అందడం లేదు?
  – ఓదెల రాజు, బ్రాహ్మణపల్లి, పెద్దపల్లి

డీఏవో : రాయితీపై జింక్ సల్ఫేట్ అవసరమని ప్రభుత్వానికి నివేదిస్తాం.

- ఒకే రేషన్‌కార్డులో నా పేరు, మా అమ్మ పేరుంది. రుణమాఫీ పోను మిగతా సొమ్ము ముందే బ్యాంకులో కట్టాలా?
  – గుడిసె గట్టయ్య, కన్నాల

డీఏవో : ప్రభుత్వం రుణమాఫీ ఇచ్చిన తర్వాతే కట్టొచ్చు. ముందే చెల్లించాలని ఆదేశాలేమీ రాలేదు.

- సన్నరకం వరిపైరు సస్యరక్షణ చర్యలేంటి?
  – రాజేశ్వర్‌రావు ఓదేడు, రాయకొమురయ్య, కొలనూరు

డీఏవో : సన్నరకం వరికి అక్కడక్కడా మొగిపురుగు, ఉల్లికోడు సోకింది. కార్బొకొరడదాన్ గుళికలు ఎకరాకి 10కిలోలు చల్లాలి. ఏఈవోల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలు పాటించాలి.

- ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.5లక్షల పంట రుణం తీసుకున్న. మాఫీ వర్తిస్తుందా?
  –రామిడి తిరుపతిరెడ్డి, కాసులపల్లి

డీఏవో : ప్రభుత్వం మూడోవిడతలో ఈనెల 15వ తేదీ వరకు రూ.2 లక్షలు మాత్రమే మాఫీ చేస్తుంది.

భవిష్యత్ తరాల కోసమే వన మహోత్సవం



మొక్క నాటుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



75 నంబరు ఆకారంలో ఏర్పాటుచేసిన మొక్కలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

రామగిరి(మంథని): భవిష్యత్ తరాల కోసమే ప్రభుత్వం మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జీఎం సుధాకర్‌రావు అధ్యక్షతన అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి శుక్రవారం ఓసీపీ–2లో సుమారు 2,350 మొక్కలు నాటారు. అప్పటి కేంద్రమంత్రి కన్హయ్యాలాల్ పేరిట 1950లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇప్పటివరకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 75 ఆకారంలో మొక్కలు ఏర్పాటు చేశామని సింగరేణి అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో శివయ్య, డీపీవో ఆశాలత, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, అధికారులు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు కె.నాగేశ్వరరావు, ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధిహామీతో అభివృద్ధి



సమావేశంలో డీఆర్డీవో రవీందర్ రాథోడ్

ఎలిగేడు(పెద్దపల్లి): ఉపాధిహామీ ద్వారా చేప ట్టే పనులతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఇదేసమయంలో కూలీలకు ఉపాధి లభిస్తోందని డీఆర్డీవో రవీందర్‌రాథోడ్ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 15వ ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023 ఏప్రిల్ ఒకటీ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మొత్తం 309 పనులకు రూ.1,36,70,603 వెచ్చించారని వివరించారు. ఈజీఎస్‌లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌టీఎం వేణు, డీపీఎం కొమురయ్య, అంబుడ్స్‌మన్ మ్యాస్ శరత్, ఎస్ఆర్‌పీ ప్రదీప్, జూనియర్ క్యూసీ హరికిషన్, అసిస్టెంట్ మేనేజర్ గణేశ్, ఏపీవో సదానందం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం ర్యాలీ

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, అప్పన్నపేట తదితర ప్రాంతాల్లో శుక్రవారం స్వచ్ఛదనం.. పచ్చదనంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇంటర్ నోడల్ అధికారి కల్పన, ఆర్డీవో గంగయ్య, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తాం



నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ సతీశ్

కోల్ సిటీ(రామగుండం): ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న రామగుండం నగర పాలక సంస్థ అధికారులపై లోకాయుక్తాకు ఫిర్యాదు చేస్తానని 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్ హెచ్చరించారు. బల్దియా కార్యాలయం ప్రధాన ముఖద్వారం ఎదుట మెట్లపై శుక్రవారం బైఠాయించి, మెడలో నల్లకండువా కప్పుకొని, చేతిలో ప్లకార్డు పట్టుకొని నిరసన తెలిపారు. సతీశ్ కుమార్ మాట్లాడుతూ, తన డివిజన్‌లోని ప్రధాన వీధులు, రామగుండం బీ- పవర్ హౌస్‌గడ్డ నుంచి జీరో పాయింట్, రైల్వేస్టేషన్ వరకు వీధిదీపాలు వెలగడం లేదన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. గత్యంతరం లేక నిరసన తెలపాల్సి వచ్చిందని తెలిపారు. కనీస వసతుల కల్పనలో విఫలమవుతున్న అధికారుల తీరుపై కలెక్టర్ స్పందించిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తానని ఆయన తెలిపారు.

బాలిక దుర్మరణం

శంకరపట్నం(మానకొండూర్): కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని, ఓ బాలిక(16) మృతిచెందినట్లు ఎస్సై రవి తెలిపారు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలవడంతో ఆమె చనిపోయిందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గురుకులంలో ఏం జరుగుతోంది?

- విద్యార్థుల మృతికి కారణాలేంటి?
- ఆరోగ్య సమస్యలా? కలుషిత నీరు, ఆహారమా? పాములా?
- వీడని మిస్టరీ..
- పెద్దాపూర్ పాఠశాలను వీడుతున్న విద్యార్థులు



తరగతి గదుల వెనక పాడుబడ్డ బావి



అధికారులతో పేరెంట్స్ వాగ్వాదం



పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న పేరెంట్స్

కోరుట్ల/మెట్‌పల్లి రూరల్: 15 రోజుల్లో ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు.. మరో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు.. ఇంకో 25 మంది అనారోగ్యంతో ఉన్నారు.. కారణం ఆరోగ్య సమస్యలా? కలుషిత నీరు, ఆహారమా? పాములా? అన్నది తెలియడం లేదు. పిల్లల మృతి మిస్టరీ వీడటం లేదు.. మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకులంలో ఈ భయానక వాతావరణం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. 40 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ పాఠశాల మంచి పేరు పొందింది. ఇప్పుడు ఇద్దరు విద్యార్థుల మృతితో అప్రతిష్ట మూటగట్టుకుంది. అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో విచారణ జరిపితే గానీ.. నిజానిజాలు నిగ్గు తేలే పరిస్థితి కనిపించడం లేదు.

సంతోషంగా చేర్పిస్తే.. విగతజీవిగా ఇంటికి

- పెద్దాపూర్ గురుకులానికి చెందిన మరో విద్యార్థి మృతి



అనిరుధ్ రెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/చందుర్తి(వేములవాడ): గురుకులంలో సీటు వస్తే తమ కుమారుడు పెద్ద చదువులు చదువుతాడని మురిసిపోయారు.. అతన్ని సంతోషంగా పాఠశాలలో చేర్పించారు.. ఎంతో భవిష్యత్తు ఉన్న కొడుకు విగతజీవిగా ఇంటికి రావడంతో ఆ కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులానికి చెందిన మరో విద్యార్థి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన ఎడమల కృష్ణారెడ్డి -ప్రియాంక దంపతులకు అనిరుధ్‌రెడ్డి(12) ఒక్కడే సంతానం. ఈ బాలుడు పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి కృష్ణారెడ్డి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లగా తల్లి ప్రియాంక ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని తల్లిగారింట్లో ఉంటోంది. ఉన్నట్టుండి అనిరుధ్‌రెడ్డి గురువారం కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి రాచర్లబొప్పాపూర్ తీసుకువచ్చారు. బాలుడి తండ్రి కృష్ణారెడ్డి గల్ఫ్ నుంచి బయలుదేరాడు. ఆయన శనివారం ఉదయానికి రాచర్ల బొప్పాపూర్ చేరుకుంటాడని, అనంతరం అనిరుధ్ రెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.



పాఠశాల ఆవరణలో పాము

పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఐదోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. స్కూల్ పరిసరాలు అడవిని తలపిస్తున్నాయి. ఎక్కడచూసినా అపరిశుభ్రతే. తరగతి గదుల వెనక చెట్ల పొదలు, బురద, పాముల పుట్టలు, గడ్డి, కూలిన పాత తరగతి గదులు, పనికి రాని సామగ్రి, కిచెన్ వెనక భాగంలో పాడుబడ్డ బావి, అందులో దోమలు.. ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని సమస్యలు. శుక్రవారం అనిరుధ్ అనే విద్యార్థి మృతిచెందాక అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థుల సంఖ్య 25 మందిగా తేలింది.

పాములతో సావాసం..

పెద్దాపూర్ గురుకులంలో ఏటా వానాకాలంలో పాములతో సావాసం చేయడం విద్యార్థులకు షరా మామూలుగా మారింది. 15 రోజుల క్రితం గణాధిత్య చనిపోవడానికి కారణం మొదట పాముకాటే అని భావించినా తర్వాత ఫిట్స్ అని వైద్య పరీక్షల్లో తేలింది. అదేరోజు అదే గదిలో నిద్రించిన మరో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. అయితే, వీరిద్దరూ చికిత్స అనంతరం కోలు కున్నా.. ఎందుకు అనారోగ్యానికి గురయ్యారో స్పష్టత రాలేదు. తాజాగా అనిరుధ్ కడుపునొప్పితో చనిపోయాడు. గురువారం తరగతి గదుల వెనక రెండు పాములను చంపినట్లు విద్యార్థులు చెబుతున్నారు. శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ పాఠశాలను సందర్శిస్తున్న సమయంలోనే ఓ పెద్ద పాము పొదల్లోకి దూరింది. టాయ్‌లెట్లు తరగతి గదులకు దూరంగా ఉన్నాయి.

వాటర్ ప్లాంట్ పని చేస్తుందా?

గురుకులంలోని మినరల్ వాటర్ ప్లాంట్ సరిగా పని చేస్తుందా అన్న అనుమానాలున్నాయి. కిచెన్‌లో కూరగాయలు, కోడిగుడ్లు కుళ్లిపోయి ఉండటం, ఎండు మిర్చికి బూజు పట్టింది. ఫుడ్‌సేఫ్టీ అధికారులు వచ్చి, శాంపిల్స్ సేకరించారు.

ఇప్పటికీ వైద్య సిబ్బందిని నియమించలే..

గణాధిత్య మృతికి కారణం ఫిట్స్ అని చెప్పినా పోస్టుమార్టంకు సంబంధించిన వివరాలు ఎవరూ స్పష్టంగా వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆ విద్యార్థి చనిపోయి 15 రోజులు గడిచినా ఇప్పటికీ పాఠశాలలో వైద్య సిబ్బందిని నియమించలేదు. అనిరుధ్‌కు కడుపునొప్పి వచ్చిన సందర్భంలోనూ ముగ్గురు ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నా తమకు సమాచారం లేదని వారు చెప్పడం గమనార్హం. నిర్వాహకులు అప్రమత్తంగా ఉంటే ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు దక్కేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లేందుకు శుక్రవారం గురుకులానికి క్యూ కట్టారు. ఉపాధ్యాయులు, నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. కొందరు విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లారు.

డీసీవో, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌లకు మెమోలు

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థుల మృతి ఘటనల్లో తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల జగిత్యాల జిల్లా కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.మహిపాల్‌రెడ్డిలకు కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం మెమోలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గానూ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మెమోలు ఇచ్చామని పేర్కొన్నారు.

కొలనూర్‌వాసిని క్షేమంగా ఇంటికి చేర్చండి

- ఇండియన్ ఎంబసీకి లేఖ రాసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): సౌదీలో ఇబ్బందులు పడుతున్న కొలనూర్ యువకుడు మేరుగు అంజిని క్షేమంగా ఇంటికి చేర్చాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సౌదీలోని ఇండియన్ ఎంబసీకి లేఖ రాశారు. 'వేతనం ఇస్తలేరు.. అడిగితే కొడుతున్నరు' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. అంజి ఎక్కడున్నాడో కనిపెట్టి, సురక్షిత ప్రదేశంలో ఉంచాలన్నారు. పాస్‌పోర్టు, ఏటీఎం కార్డులు తీసుకొని, ఇబ్బందులకు గురిచేస్తున్న సదరు కంపెనీపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.

టీజీఈసెట్ స్పాట్ అడ్మిషన్స్ గడువు పొడిగింపు

తిమ్మాపూర్(మానకొండూర్): టీజీఈసెట్-2024 స్పాట్ అడ్మిషన్స్ గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు టీజీసెట్ కన్వీనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగాల్లో సీట్లు మిగిలాయన్నారు. డిప్లొమా చేసి, బీటెక్ సెకండియర్‌లో నేరుగా ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంజినీరింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 169 కాలేజీల్లోని 12,705 సీట్లకుగానూ ఇప్పటివరకు 11 వేల సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఫార్మసీలో 121 కాలేజీల్లోని 1,180 సీట్లకు గానూ 500 సీట్లే భర్తీ అయ్యాయని పేర్కొన్నారు.

మోసం చేసిన గల్ఫ్ ఏజెంట్‌పై కేసు

జగిత్యాల క్రైం: ఉద్యోగాల పేరిట డబ్బులు తీసుకొని మోసం చేసిన ఓ గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం శాలపల్లికి చెందిన పొన్నం సాయిలును జగిత్యాల మహాలక్ష్మినగర్‌లో ఎంఆర్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ప్రైవేటు లిమిటెడ్ నడుపుతున్న మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌కు చెందిన పల్లికొండ మహేశ్ ఇజ్రాయిల్ పంపిస్తానని రూ.4 లక్షలు వసూలు చేశాడు. కొన్ని రోజుల తర్వాత అక్కడ యుద్ధం జరుగుతోందన్నాడు. మరో రూ.1.20 లక్షలు తీసుకున్నాడు. ఇంకో ఐదుగురి వద్ద రూ.2.50 లక్షల చొప్పున, ఒక కుటుంబానికి చెందిన నలుగురి వద్ద రూ.2 లక్షల చొప్పున వసూలు చేశాడు. అందరినీ ఫ్రాన్స్‌లోని రియూనియల్‌కు పంపించాడు. ఎలాంటి ఉద్యోగాలు లేకపోవడంతో అక్కడి పోలీసులు వీరిని స్వదేశానికి పంపారు. తిరిగొచ్చిన సాయిలు మహేశ్‌ను డబ్బులు అడగగా నీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

మొక్కలు నాటి.. నీళ్లు పోసి..

- ర్యాలీలు నిర్వహించి..
- బల్దియాలో ముగిసిన స్వచ్ఛదనం.. పచ్చదనం



మొక్కలు నాటుతున్న మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ శ్రీకాంత్ తదితరులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఐదు రోజులపాటు నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం శుక్రవారం ముగిసింది. చివరిరోజు నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి మేయర్ బంగి అనిల్ పచ్చజెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం కాలేజీ మైదానంలో మొక్కలు నాటారు. మేయర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రభుత్వం స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. కాలుష్యం అధికంగా ఉండే రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఆక్సిజన్ అందించే మొక్కలు పెంచడం ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అంటు వ్యాధుల వ్యాప్తికి కారణమయ్యే దోమలు, ఈగలను నివారించడానికి నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమానికి ప్రజలు సహకరించాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, మున్సిపల్ సిబ్బంది, స్వశక్తి మహిళల సహకారంతో డివిజన్లలో డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నిల్వఉన్న నీటిని తొలగించడం తదితర కార్యక్రమాలతోపాటు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో జ్వర సర్వే కూడా చేపడుతున్నామని వివరించారు. స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దడానికి ప్రజలు ఆరు బయట చెత్త పడవేయకుండా మున్సిపల్ వాహనాలకు ఇచ్చి సహకరించాలని, అలాగే నగరంలో పచ్చదనం పెంపొందడానికై మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయం నుండి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం వరకు మెప్మా, నగర పాలక సంస్థ, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు, విద్యార్థినీ విద్యార్థులు, ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ క్యాడెట్లు ర్యాలీ గా తరలి వెళ్ళి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. నగర మేయర్ బంగి అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సి హెచ్ శ్రీకాంత్, స్థానిక అటవీ శాఖ అధికారి రహమతుల్లా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జై కిషన్ ఓజా, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సంజీవయ్య, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సెక్రెటరీ రాజు, ఈఈ రామన్, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, మెప్మా టిఎంసి ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న బీఎంఎస్ నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాల్లో 40 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి వై.సారంగపాణి డిమాండ్ చేశారు. శుక్రవారం డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 2023-2024 ఆర్థిక సంవత్సరం ముగిసి 5నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు లాభాల వాటా ప్రకటించలేదన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 67.13 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తే రూ.33 వేల కోట్ల వ్యాపారం జరిగి రూ.2,222 కోట్ల లాభాలు వచ్చాయని, అందులో 32శాతం అంటే.. రూ.711.18 కోట్లను గత సంవత్సరం చెల్లించారని గుర్తుచేశారు. గతేడాది కార్మికులు కష్టపడి రికార్డు స్థాయిలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారని, రూ.37వేల కోట్ల వ్యాపారం జరిగిందని, గత సంవత్సరంతో పోలిస్తే ఈఆర్థిక సంవత్సరంలో లాభాలు అధికంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. నాయకులు మొగిలిపాక రవి, తాండ్ర మొగిలి, బండారి శ్రీనివాస్, గోగుల రవి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కోనరావుపేట(వేములవాడ): అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన గొట్టె రాజయ్య-వెంకవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు మనోజ్, మహేశ్ ఉన్నారు. ఇద్దరూ కరీంనగర్‌లో కూలీ పని చేస్తున్నారు. ఈ క్రమంలో మహేశ్ గురువారం రాత్రి కోనరావుపేట వచ్చాడు. అతను కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉరేసుకున్నాడు.

27 మంది ఎస్సైల బదిలీ

గోదావరిఖని: మల్టీజోన్-1 పరిధిలో 27మంది ఎస్సైలను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీచేశారు. వీరిలో 8 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేయగా, మిగతా ఎస్సైలను బదిలీచేస్తూ ఆదేశాలు జారీఅయ్యాయి. బదిలీ అయిన ఎస్సైల వివరాలు..

పేరు	ప్రస్తుతస్థానం	బదిలీస్థానం
ఎస్.సామ్యూల్‌పాల్	పదోన్నతి	సీసీఎస్ మంచిర్యా
ఎస్.శ్రీనివాస్	పదోన్నతి	వుమెన్, శ్రీరాంపూర్
ఎస్.శ్రీనివాస్	పదోన్నతి	మందమర్రి-2
పి.రాజయ్య	పదోన్నతి	లక్సెట్టిపేట-2
అక్బర్‌పాషా	పదోన్నతి	రామకృష్ణాపూర్-2
కె.వేణుగోపాల్	పదోన్నతి	సుల్తానాబాద్-2
ఎస్.రాములు	పదోన్నతి	మంచిర్యాల,ట్రాఫిక్
కె.మహేందర్‌రెడ్డి	పదోన్నతి	సీసీఆర్‌బీ, రామగుండం
కె.రామకృష్ణ	వీఆర్	సీఎస్‌బీ, రామగుండం
కె.రమేష్	టాస్క్‌ఫోర్స్	జీడీకే-1టౌన్
వి.హైమా	వీఆర్	షీటీం, మంచిర్యాల
ఎ.మధుసూదన్	ముత్తారం	సీసీఎస్, మంచిర్యాల
గోపతి నరేష్	వీఆర్	ముత్తారం, ఎస్‌హెచ్‌వో
పి.చంద్రకుమార్	వీఆర్	రామగిరి, ఎస్‌హెచ్‌వో
కె.సందీప్‌కుమార్	రామగిరి	జీడీకే-1టౌన్
ఎ.వెంకటకృష్ణ	మంథని	వీఆర్, రామగుండం
డి.రమేష్	వీఆర్	మంథని, ఎస్‌హెచ్‌వో
ఎం.చంద్రశేఖర్	కమాన్‌పూర్	వీఆర్, రామగుండం
కె.ప్రసాద్	భూపాలపల్లి	కమాన్‌పూర్
ఎ.వెంకటేశ్వర్	వీఆర్, ములుగు	జీడీకే-2టౌన్
ఎం.ప్రశాంత్	మంచిర్యాల	వాంకిడి, ఎస్‌హెచ్‌వో
డి.సాగర్	వాంకిడి	జైనూర్, ఎస్‌హెచ్‌వో
టి.మాధవ్	సిర్పూర్	తిర్యాణి, ఎస్‌హెచ్‌వో
ఐ.నరేష్	వీఆర్	చింతలమన్నెపల్లి
డి.మహేందర్	డీఎస్‌బీ	కాగజ్‌నగర్, ఎస్‌హెచ్‌వో
ఎ.సోనియా	కాగజ్‌నగర్	డీఎస్‌బీ, ఆసిఫాబాద్
డి.రామకృష్ణ	వీఆర్	సిర్పూర్, ఎస్‌హెచ్‌వో

మహిళను కొట్టిన పోలీసులు

మెట్‌పల్లి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఓ ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్ ఓ మహిళ పట్ల వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. కుటుంబ కలహాలతో దంపతులు గురువారం ఠాణాకు వచ్చారు. ఆ సమయంలో భార్య తన భర్తతో గొడవకు దిగింది. ఇది గమనించిన ఏఎస్సై ఆమెను లాఠీతో, హెడ్ కానిస్టేబుల్ చేతితో కొట్టి, స్టేషన్ నుంచి పంపించారు. మహిళా పోలీసులు ఉన్నా వీరు కొట్టడం చర్చనీయాంశమైంది.

విచారణ జరుపుతున్నాం : సీఐ నిరంజన్ రెడ్డి

మహిళ విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై విచారణ జరుపుతున్నాం.

గని ప్రమాదాలపై సింగరేణి సీరియస్

- నేడు సేఫ్టీ కమిటీలతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్

గని ప్రమాదాల సమాచారం

సంవత్సరం	2020	2021	2022	2023	2024 (ఇప్పటివరకు)
మృతులు	09	13	05	05	05
సీరియస్	98	122	96	68	44
రిపోర్టబుల్	108	107	122	70	44



- ఈఏడాది జనవరిలో టబ్బులు ఢీకొని ఆర్జీ-1 ఏరియా జీడీకే-2ఏ గనిలో మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డి మృతి చెందాడు.
- మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో గత మార్చిలో జరిగిన ప్రమాదంలో జనరల్ మజ్దూర్ కర్రె రాజు చనిపోయాడు.
- జీడీకే-11గనిలో గత మేలో జరిగిన ప్రమాదంలో ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్ ఇజ్జగిరి ప్రతాప్ దుర్మరణం చెందాడు.
- జూలై 17న ఓసీపీ-2లో జరిగిన ప్రమాదంలో ఉప్పు వెంకటేశ్వర్లు(ఫిట్టర్), గాదెం విద్యాసాగర్(జనరల్ మజ్దూర్) మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి.
- ఇటీవల జీడీకే-2వ గనిలో గనిపైకప్పు కూలి ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి.

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల్లో జరుగుతున్న ప్రమాదాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత ఐదేళ్లతో పోల్చితే ప్రమాదాలు తగ్గినా.. చిన్న తప్పిదాలతో నిండు జీవితాలు బలైపోతున్నాయి. గనులు, పనిస్థలాల్లో ప్రమాదాల నియంత్రణ చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక రక్షణ విభాగం ఉన్నా నామమాత్రంగానే పనిచేస్తోందనే విమర్శలు ఉన్నాయి. ఏదోఒకచోట సాధారణ, సీరియస్ ప్రమాదాలు జరుగుతూ రక్షణ వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. ఈక్రమంలో ప్రమాదాల నివారణ కోసం గతనెల 19న సింగరేణిస్థాయి సేఫ్టీ త్రైపాక్షిక సమావేశాన్ని హైదరాబాద్ సింగరేణి భవన్‌లో నిర్వహించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగుతున్న సంస్థలో ప్రమాదాల నివారణే లక్ష్యంగా యాజమాన్యం ముందుకు సాగుతున్నా.. చిన్న నిర్లక్ష్యంతో పెద్దమూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

నిర్మాణాత్మకమైన చర్యలకు సూచనలు

- ప్రమాదాల నివారణలో అధికారులు నిర్మాణత్మక పాత్ర పోషించాలి
- రక్షణ చర్యలను పర్యవేక్షించే విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- ప్రమాదం జరిగిన తర్వాత చేపట్టే పోస్టుమార్టం కన్నా ముందుగానే నివారణ చర్యలు తీసుకోవాలి
- గతంలో భూగర్భ గనుల్లో రూఫ్‌పాలింగ్, సైడ్‌ఫాలింగ్, టబ్బుల ప్రమాదాలు జరిగేవి. ఓసీపీల్లో భారీ యంత్రాలు ఢీకొనేవి.
- ప్రస్తుతం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నా తరచూ ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది.
- కేంద్ర ప్రభుత్వ అధీనంలో కొనసాగే డీడీఎంఎస్‌లు పాత్రపై కూడా విమర్శలొస్తున్నాయి

నేడు సీఎండీ వీడియో కాన్ఫరెన్స్

సంస్థలోని పిట్‌సేఫ్టీ, మైన్స్ సేఫ్టీ, ఏరియా కమిటీ సభ్యులతో సంస్థ సీఎండీ ఎన్.బలరాం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రమాదాలపై సమీక్షించనున్నారు. ఈమేరకు అన్ని ఏరియాల సేఫ్టీ కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడనున్నారు. ఇటీవల రక్షణత్రైపాక్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించనున్నారు.